అన్నోజిగూడలో అండర్‌పాస్ కోసం వినతి

పోచారం: అన్నోజిగూడలలోని ఎన్టీపీసీ చౌరస్తా వద్ద అండర్ పాస్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతూ రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌కు చైర్మన్ కొండల్‌రెడ్డి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఎన్టీపీసీ చౌరస్తా వద్ద తరచుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అండర్ పాస్ నిర్మించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. లక్ష్మణ్‌ను కలిసిన వారిలో కౌన్సిలర్ మహేష్ ఉన్నారు.

డాక్టర్ కైసర్ మోహియుద్దీన్‌కు పలువురి అభినందనలు


అవార్డు అందుకుంటున్న కైసర్ మోహియుద్దీన్

ఘట్‌కేసర్: ఉత్తమ ఆప్త మాలిక్ ఆఫీసర్‌గా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి కంటి వైద్య నిపుణులు కైసర్ మోహియూద్దీన్ ఎంపికయ్యారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో జరిగిన సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రఘునాథ్ స్వామి, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి నారాయణ రావు ఆయనకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి కోట్యానాయక్, ఇతర వైద్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.

మొక్కలు నాటిన విద్యార్థులు



కీసర: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని జూబ్లిహిల్స్ పబ్లిక్ స్కూల్ రాంపల్లి పాఠశాల ప్రిన్సిపాల్ పద్మజరావు అన్నారు. శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా పాఠశాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలను నాటే కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మొక్కలు నాటుడూ సందడి చేశారు.

ఘట్‌కేసర్‌లో ఫ్రైడే డ్రై డే


చిట్టీరుకుంటలో ఆయిల్ బాల్స్ వేస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, కౌన్సిలర్ రమాదేవి, సీఐ సైదులు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో చైర్ పర్సన్ పావనీజంగయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక చిట్టీరుకుంటలో కౌన్సిలర్ రమాదేవి, సీఐ సైదులుతో కలిసి దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వర్షాకాలంలో దోమలు పెరగకుండా ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, పరిశుభ్రంగా ఉచంకోవాలన్నారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, శివాకష్టారెడ్డి, శ్రీను, రాజేశ్, యోగేశ్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కీసర: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు ధరిచేరవని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపాలిటీలోని 20వ వార్డులో ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీల్లో నివసిస్తున్న ప్రజలంతా ఫ్రైడే డ్రైడేలో భాగంగా ఒక్కగంటసేపు తమ ఇంటిపరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు పనులు చేపట్టాలన్నారు. కౌన్సిలర్ అన్నంరాజు సుమిత్రసురేష్, మున్సిపల్‌కమిషనర్ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌ను కలిసిన నాయకులు



మేడ్చల్ రూరల్: రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మెన్‌గా బాధ్యతలు చేపట్టిన ప్రీతమ్‌ను శుక్రవారం గుండ్లపోచంపల్లి మున్సిపల్ నాయకులు కలిశారు. చైర్మెన్‌ను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కుండ భానుచందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం



కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ కాలనీలో గల బాయికాడ మైసమ్మ అమ్మవారి దేవాలయం పున:నిర్మాణ పనులను శుక్రవారం 9వ వార్డుకౌన్సిలర్ కొముల్లె అనితా సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా దేవాలయ నిర్మాణానికి తనవంతుగా రూ 10వేలను విరాళంగా అందజేసారు. కార్యక్రమంలో పూలకుర్తి నర్సింహ్మా, సత్యంరాజు, చెండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగుల్లో బదిలీల సందడి

జీవో జారీ చేసిన ప్రభుత్వం
- జిల్లా స్థాయిలో కమిటీ ఏర్పాటు
- 4 ఏళ్లు దాటిన ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి



సాక్షి,మేడ్చల్ జిల్లా: ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాతో పాటు జోనల్, రాష్ట్ర స్థాయి ఉద్యోగుల బదిలీ ప్రక్రియను ఈనెల 20లోగా ముగించాలని ప్రభుత్వం నిర్దేశించింది. దీంతో ఉద్యోగుల్లో బదిలీలకు సంబంధించిన దరఖాస్తుల సందడి నెలకొంది. రాష్ట్ర ఆవిర్భావం నుంచి పలువురు ఉద్యోగులు జిల్లాలోనే విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు 10 మంది వరకు బదిలీ అయ్యే అవకాశముంది. ప్రభుత్వ నిబంధనల మేరకు నాలుగేళ్ల సర్వీసు నిండిన వారందరు బదిలీ కానున్నారు. ఈ ప్రక్రియ జిల్లా, జోనల్ పరిధిలో జరుగనుంది.

కమిటీల ఏర్పాటుకు కసరత్తు

బదిలీలను నిర్వహించేందుకు ప్రతి శాఖలో ప్రత్యేకంగా కమిటీలను వేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. మల్టీజోన్ లేదా జోనల్ స్థాయి ఉద్యోగుల కోసం శాఖాధిపతి అదనపు కార్యదర్శి, జాయింట్ డైరెక్టర్ సభ్యులుగా కమిటీ ఏర్పడనుంది. జిల్లా స్థాయిలో కలెక్టర్, అదనపు కలెక్టర్, సంబంధిత శాఖ అధికారి సభ్యులుగా ఉండనున్నారు.

నాలుగు స్థాయిల్లో..

బదిలీల ప్రక్రియ నాలుగు స్థాయిల్లో స్థాన చలనం కల్పించనున్నారు. ఇందులో జిల్లా స్థాయిలో అటెండర్ మొదలుకొని రికార్డు అసిస్టెంట్, టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్లు జిల్లాలోని మండలాల పరిధిలో బదిలీ కానున్నారు. ఇక జోన్ పరిధిలో సీనియర్ అసిస్టెంట్లు మొదలుకొని సూపరింటెండెంట్, డిప్యూటీ తహసీల్దార్లు, గ్రేడ్ 1, 2, 3 పంచాయతీ కార్యదర్శులు, హెచ్‌ఐడబ్ల్యూవో, ఏఎన్ఎం, స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, వెటర్నరీ అసిస్టెంట్, వంటి హోదా కలిగిన ఉద్యోగులకు జోన్ పరిధిలోని జిల్లాల పరిధిలో బదిలీలు జరగనున్నాయి. ఎంపీడీవో, తహసీల్దార్, ఎంపీవో, వ్యవసాయాధికారి, ఏఈఈలు, ఏఎసీడబ్ల్యూవో, ఏటీవో, మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ సివిల్ సర్జన్ వంటి క్యాడర్లో పని చేసే వారికి మల్టీజోన్ పరిధిలో బదిలీ కానుంది. జిల్లా అధికారులతో పాటు సివిల్ సర్జన్లు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లకు రాష్ట్ర స్థాయిలో బదిలీలు జరగనున్నాయి.

కొరవడిన స్పష్టత..

అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా జిల్లాలో మూడేళ్ల సర్వీసు నిండిన తహసీల్దార్, ఎంపీడీవోలను ఇతర జిల్లాలకు బదిలీ చేశారు. ఇతర జిల్లాల నుంచి ఇక్కడికి పలువురు రెవెన్యూ, పంచాయతీరాజ్ ఉద్యోగులు బదిలీపై వచ్చారు. ఎన్నికల ప్రక్రియ పూర్తవడంతో వీరు సొంత జిల్లాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం వీరిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఈ ఉద్యోగుల బదిలీపై స్పష్టత కొరవడింది.

జిల్లాల పరిధిలో

ఉద్యోగాల భర్తీకి రాష్ట్రాన్ని ఏడు జోన్లుగా విభజించిన విషయం తెలిసిందే. జోన్ల ఏర్పాటు తర్వాత తొలిసారి బదిలీలు జరగనుండడంతో ఆయా జిల్లాల పరిధిలోని ఖాళీలు, సీనియార్టీ జాబితాలను ఆరా తీస్తున్నారు. జిల్లా స్థాయి ఉద్యోగులకు జిల్లా పరిధిలోనే స్థానచలనం కలగనుంది. నాలుగేళ్లకు మించి ఒకే చోట పనిచేస్తున్న వారి జాబితా విడుదల కానుంది.

వన మహోత్సవ లక్ష్యాలు పూర్తిచేయాలి


జిల్లా అధికారుల సమావేశంలో కలెక్టర్ గౌతమ్

సాక్షి, సిటీబ్యూరో: వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘాలు, మండలాలు, గ్రామ పంచాయతీలతోపాటు వివిధ జిల్లా శాఖలకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం వీసీ మీటింగ్ హాలులో అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వనమహోత్సవం కింద జిల్లాలో 63 లక్షల మొక్కలు నాటే లక్ష్యాన్ని నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున మొక్కలు బతికే అవకాశం ఎక్కువగా ఉందని, వెంటనే మొక్కలు నాటడం మొదలు పెట్టాలన్నారు. ప్రతి ఒక్కరు ఇంటిముందు మొక్కలు నాటేందుకు పంపిణీ చేయాలన్నారు. మున్సిపల్ అధికారులకు, ఎంపీడీవోలకు, జిల్లా అధికారులకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు పక్కా యాక్షన్ ప్లాన్ రూపొందించి మొక్కలు నాటే ప్రదేశాలను గుర్తించాలన్నారు.

పనులు సత్వరమే పూర్తిచేయండి

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు చాలావరకు పనులు పూర్తయ్యాయని, పలు స్కూళ్లో వివిధ దశలో కొనసాగుతున్న పనులను సత్వరమే పూర్తి చేయించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా చేపట్టిన మైనర్ రిపేర్లు, ఎలక్ట్రిషన్, త్రాగునీరు టాయిలెట్స్ వంటి మౌలిక వసతుల పనులు చాలా వరకు పూర్తయ్యాయని, మిగిలి ఉన్న వాటిని త్వరగా పూర్తి చేయాలన్నారు. గతంలో పాఠశాలలో ఉన్న పరిస్థితులు.. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు చేపట్టిన తర్వాత పాఠశాలల్లో అభివృద్ధి వంటి ఫోటోలను సమర్పించాలన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించేలా పకడ్బందీ పర్యవేక్షణ జరగాలన్నారు. మున్సిపాలిటీ,ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజా పాలన సేవా కేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కౌంటర్లు ఉండాలన్నారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయడానికి ఆపరేట్లను అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి, జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ జానకిరామ్, మున్సిపల్ అధికారులు, ఎంపీడీవోలు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కీసర దాయర దళితుల భూములను వారికే కేటాయించాలి

కలెక్టర్ గౌతమ్‌కు మాజీ ఎంపీ హన్మంతరావు వినతి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలోని కీసర దాయర రెవెన్యూ పరిధిలో దళితుల కుటుంబాలకు కేటాయించిన ప్రభుత్వ భూమి వారికే దక్కేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను మాజీ ఎంపీ ఎం.హన్మంతరావు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు ఎంహెచ్ వినతి పత్రం అందజేశారు. కీసర దాయర రెవెన్యూ పరిధిలో 94.06 ఎకరాల భూమిని అప్పటి ప్రధాని ఇందిరాగాంధి ఇచ్చినట్లు హన్మంతరావు పేర్కొన్నారు. 2003లో దళితులకు ఏలాంటి నోటీసులు ఇవ్వకుండా కీసర ఎంఆర్‌ఓ వారి పేర్లను తొలగించి,రాగి కృష్ణారెడి, రాగి జానకిరెడ్డి, రాగి కృష్ణ, అనితారెడ్డి, అరుణారెడ్డి పేర్లను నమోదు చేసినట్లు తెలిపారు. దళితులు రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో కేసు వేయగా, పరిశీలించిన న్యాయస్థానం 2018 జులై17న ఆర్డర్ ఇవ్వాలని అప్పటి జిల్లా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. అలాగే, సివిల్ కోర్టులో కేసు వేయగా, దీనిపై విచారణ కొనసాగుతుందన్నారు. ఇదిలా ఉండగానే కోర్టును ధిక్కరిస్తూ ... రాగి కుటుంబ సభ్యులు ఈ భూములను విక్రయిస్తున్నారని హన్మంతరావు ఆరోపించారు. జిల్లా కలెక్టర్ పి.గౌతమ్‌ను కలసిన వారిలో మాజీ ఎంపీ వి.హనుమంతరావుతోపాటు పీసీసీ ఎస్సీ సెల్ వైస్‌చైర్మన్ రమేష్, పీసీసీ కార్యదర్శి అఫ్సర్ యూసఫ్ జాహి, భూమి బాధితులు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అదనపు తరగతి గదుల పనులు ప్రారంభం



ఘట్‌కేసర్: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో పీఎంఎస్‌హెచ్‌ఆర్‌ఐ పథకం కింద మంజూరైన రెండు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా చైర్ పర్సన్ పావనీజంగయ్య, స్థానిక కౌన్సిలర్ నశ్రీన్‌సుల్తానా, హెచ్ఎం పాపిరెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సిరాజ్, ఫిజికల్ డైరెక్టర్ శ్రీరాములు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ కిట్స్ పంపిణీ

జవహర్‌నగర్: కుష్టు రోగం శరీరానికే కాని మనసుకు కాదని ఎస్ఎల్‌ఏపీ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు రమేష్ అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని మదర్ థెరిస్సా కాలనీలో ఎన్‌టీపీసీ సంస్థ సహకారంతో ఎస్ఎల్‌ఏపీ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు రమేష్, డివిజన్ అధ్యక్షులు బూడిద వెంకటేష్ ఆధ్వర్యంలో 50 మంది కుష్టు వ్యాధి బాధితులకు మెడికల్ కిట్లు, సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనసూయ, మంజుల, శివమ్మ, తదితరులు పాల్గొన్నారు.



ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


మొక్కలను నాటుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ ప్రణీతాగౌడ్ తదితరులు

కీసర: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ అన్నారు. వనమహోత్సవంలో భాగంగా శుక్రవారం ఆర్‌జీపీ కాలనీలోని డీఆర్‌సి సెంటర్‌వద్ద మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసారి లక్ష్యానికి మించి మొక్కలు నాటతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, కౌన్సిలర్లు నానునాయక్, కొత్తహేమలత, మంగళపురి వెంకటేష్, రామారం శ్రీహరిగౌడ్ పాల్గొన్నారు.

దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తాం


సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. శుక్రవారం చర్లపల్లి డివిజన్ నాగర్జుననగర్ కాలనీలో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. శిథిలమైన అంతర్గత రోడ్లను పరిశీలించి అధికారులతో మాట్లాడారు. కాలనీలో మంచినీటి, వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఏఈ కీర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, నాగిళ్ల బాల్‌రెడ్డి, పోచయ్యగౌడ్, కాసుల అంజయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేత

డివిజన్ పరిధిలోని శ్రీరామ్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు కాలనీ సమస్యలపై కార్పొరేటర్ బొంతు శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. కాలనీలో మిగిలిపోయిన డ్రైనేజీ నిర్మాణ పనులు, వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు తదితర సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



మేడ్చల్ రూరల్: ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు పాటుపడాలని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహా రెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా మున్సిపాలిటీ పరిధి 4వ వార్డులోని మల్లారెడ్డి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.

ఇంటింటికీ మొక్కల పంపిణీ..

వనమహోత్సవంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో స్థానిక కౌన్సిలర్ కౌడె మహేశ్ ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరు తమక ఇచ్చిన మొక్కలను ఇంటి ఆవరణలో నాటి వాటిని పెంచాలని కోరారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వాలి

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వాలు మారినా విద్యార్థులకు ఉపకార వేతనాలు అందని పరిస్థితి నెలకొందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణలో ఉపకార వేతనాలు,ఫీజు రీయింబర్స్ మెంట్స్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం భారత విద్యార్థి ఫేడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మేడ్చల్ జిల్లా కమిటీ అధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శనతో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.... గత ఆరేళ్ళ నుంచి విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజులను ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. రాష్ట్రంలో సంవత్సరానికి 14 లక్షల మంది విద్యార్థులు స్కాలర్ షిప్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారని, వీరికి సంవత్సరానికి రూ. 3 వేల కోట్లు అవసరం అవుతాయన్నారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ ఆదేశాలతో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి కేశురామ్‌కు ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కార్తీక్ , అరుణ్, వంశీ, మనోజ్, కిరణ్, అవినాష్, శ్యామ్ రావు, సుబ్బు, బాలు, అజయ్, శ్రీనివాస్, తేజ, కార్యకర్తలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో వ్యక్తి మృతి


రాజేందర్ (ఫైల్)

మేడ్చల్ రూరల్: డెంగీతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని కాసింబాయి తండాలో చోటు చేసుకుంది. తండాకు చెందిన భుక్యా రాజేందర్(38) గత కొంత కాలంగా అనారోగ్యానికి గురి కావడంతో పరీక్షలు నిర్వహించగా డెంగీ వాధి బారిన పడినట్లు వైద్యులు నిర్ధారించారు. గత గురువారం రాజేందర్ ఆరోగ్యం విషమించడంతో కుటుంబీకులు మేడ్చల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు దివ్యాంగుడు కాగా అతనికి భార్య, కుమార్తె ఉన్నారు.

విద్యార్థి అదృశ్యం


వంశీ (ఫైల్)

మేడ్చల్ రూరల్: ఇంటికి వస్తున్నానని ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చిన విద్యార్థి అదృశ్యమైన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్ తెలిపిన మేరకు.. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్ద గుండవెల్లి గ్రామానికి చెందిన శనిగరం వంశీ(21) మేడ్చల్ పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో తోటి విద్యార్థులతో కలిసి నివాసం ఉంటూ మల్లారెడ్డి కళాశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. ఈ నెల 11న సాయంత్రం 5.30 గంటల సమయంలో ఇంటికి వస్తున్నానని కుటుంబీకులకు ఫోన్‌లో సమాచారం ఇచ్చిన వంశీ ఇంటిక చేరుకోలేదు. బంధువుల ఇళ్లలో ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో తండ్రి భూపతి మేడ్చల్ పోలీసులను ఆశ్రయించాడు.

వర్క్ ఫ్రం హోం పేరుతో రూ. 5.72 లక్షల టోకరా

కీసర: ఇంటి వద్ద నుండే పని చేసుకోవచ్చని నమ్మించి లక్షల్లో డబ్బు బదిలీ చేయించుకున్న కేటుగాళ్లపై కీసర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కీసరలోని రాక్ ఫ్రంట్ కాలనీకి చెందిన తుమ్మల నాగలక్ష్మికి ఈ నెల 4న వాట్సప్ ద్వారా వర్క్ ఫ్రం హోం అనే పదంతో లింక్ వచ్చింది. రేటింగ్ అండ్ రివ్యూ ఇస్తే బోనస్ వస్తుందని లింక్‌లో సమాచారం ఉంది. నమ్మి రేటింగ్ ఇచ్చింది. దీంతో ఆమెకు రూ. 300 బోనస్ వచ్చిందని, బ్యాంక్ అకౌంట్ వివరాలు ఇస్తే డబ్బు బదిలీ చేసి, గ్రూపులో చేర్చుకుంటామని చెప్పడంతో అకౌంట్ వివరాలు ఇచ్చింది. అనంతరం టెలిగ్రామ్ ఐడీ సృష్టించి నాగలక్ష్మికి ఇవ్వడంతో టెలిగ్రామ్‌లో లాగిన్ అయింది. టాస్క్ 1, టాస్క్ 2 వంటి పదాలు ఉండటంతో వాటిని చూసి డబ్బు వస్తాయని ఆశపడి రూ. 5000 పంపింది. అందుకు ఆమెకు రూ. అదనంగా రూ. 800 వచ్చాయి. తర్వాత రూ. 20 వేలు పంపితే రూ. 40 వేలు వచ్చాయి. రూ. 40 వేలు పంపితే రూ. 80 వేలు వస్తాయని భావిస్తే డబ్బు బదిలీ పెండింగ్‌లో పడిందని సమాచారమిచ్చారు. మరుసటి రోజు ఫోన్ చేసి రూ. 1.46 లక్షలు పంపితే రూ. 3 లక్షలు వస్తాయని నమ్మించారు. ఆశకు పోయిన ఆమె అప్పు చేసి డబ్బు తెచ్చి బ్యాంక్ ద్వారా బదిలీ చేసింది. ఇదీ ప్రాసెసింగ్‌లో పడిపోయిందని చెప్పి శని, ఆదివారాలు గడువు తీసుకున్నారు. సోమవారం ఫోన్ చేసి రూ. 3.86 లక్షలు పంపితే రూ. 21 లక్షలు వస్తాయనడంతో అడిగిన విధంగా నాగలక్ష్మి డబ్బు పంపారు. చివరకు డబ్బు రాకపోవడంతో సైబర్ నేరగాళ్ల చేతిలో మొత్తం రూ. 5.72 లక్షలు మోసపోయానని తెలుసుకొని పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సఫిల్‌గూడ చెరువును అభివృద్ధి చేస్తాం


చెరువులో గుర్రపు డెక్కను పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి


చెరువలో పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి

- మేయర్ విజయలక్ష్మి
- అధికారుల తీరుపై అసంతృప్తి
- పద్ధతి మార్చుకోండి.. లేదా మార్చేస్తా డీఈ మహేష్‌కు హెచ్చరిక

మల్కాజిగిరి: సఫీల్‌గూడ చెరువు, లేక్‌పార్కును అభివృద్ధి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటామని మేయర్ విజయలక్ష్మి అన్నారు. కార్పొరేటర్ శ్రవణ్ సఫీల్‌గూడ చెరువులో పేరకపోయిన గుర్రపు డెక్కతో ఇటీవల కౌన్సిల్ సమావేశంలో నిరసన వ్యక్తం చేశాడు. ఆయన విజ్ఞప్తి మేరకు కమిషనర్ ఆమ్రపాలితో కలిసి శుక్రవారం చెరువును పరిశీలించారు. పేరుకుపోయిన గుర్రపు డెక్క, చెత్తాచెదారం, విరిగిపోయిన చిన్నపిల్లల ఆట వస్తువులు, ఆడుకునే ప్రాంతంలో ఇసుక లేకపోవడాన్ని గమనించి ఇంజినీరింగ్ విభాగం ఈడీ మహేశ్‌పై మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డీసీ రాజు, ఎంటమాలజీ విభాగం అధికారులు గైర్హాజరు కావడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గైర్హాజరైన అధికారులకు మెమో జారీ చేస్తానని హెచ్చరించారు. వినాయక నిమజ్జనం పాండ్‌తో పాటు విరిగిన ఆట వస్తువుల పరిసరాలను 15 రోజుల్లో సరిదిద్దాలని ఆదేశించారు. అధికారులు అవకాశం ఉన్న మేరకు స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులు రాకుండా అధికారులు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎన్నడూ కనిపించని విధంగా శుభ్రం

మేయర్ పర్యటన ముందస్తు సమాచారం తెలుసుకున్న శానిటేషన్ విభాగం ఉన్నతాధికారులు మేయర్ పర్యటించే ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. ఆయా ప్రాంతాల్లో ఎన్నడూ కనిపించని విధంగా పరిశుభ్రంగా ఉండటాన్ని చూసి స్థానిక ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఎల్లప్పుడు ఇలా పరిశుభ్రంగా ఉంటే బాగుండని పలువురు చర్చించుకున్నారు.